సాక్షి
కుమురం భీం
బుధవారం । 10 । ఏప్రిల్ । 2024





## సందడే.. సందడి

వేసవి సెలవులకు ముందే క్రీడా శిక్షణలు మొదలయ్యాయి. విద్యాసంస్థలు ఒంటి పూటే కొనసాగుతుండగా సాయంత్రం విద్యార్థులు శిక్షణకు హాజరవుతున్నారు. 8లో▸

**రంజాన్ వేళలు**

బుధ
ఇఫ్తార్
6:33

గరిష్టం/కనిష్టం
37.0 /24.0

**వాతావరణం**

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గి వాతావరణం చల్లబడుతుంది.

## న్యూస్‌రీల్

### 23న వీరహనుమాన్ శోభాయాత్ర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**కాగజ్‌నగర్‌రూరల్:** కాగజ్‌నగర్ పట్టణంలో ఈ నెల 23న సాయంత్రం 4 గంటలకు బాల భారతి హనుమాన్ మందిర్ నుంచి బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శ్రీవీరహనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని ఆలయంలో మంగళవారం శోభాయాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను విజయవంతం చేయాలని వారు కోరారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ రాజేందర్, బజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ శివా గౌడ్, నాయకులు కొంగ సత్యనారాయణ, వీరభద్రచారి, శ్రీనివాస్, రంగస్వామి, మురళి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కుమురం భీంకు నివాళి



భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ సీఈవో అనిల్‌కుమార్

**కెరమెరి(ఆసిఫాబాద్):** జోడేఘాట్‌లోని కుమురం భీం విగ్రహానికి మంగళవారం జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. భీం సమాధి వద్ద పూజలు చేసి మ్యూజియాన్ని సందర్శించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధిహామీ పథకం పనులపై ఆరా తీశారు. ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని, ప్రతీ పంచాయతీ పరిధిలో ప్రతిరోజూ 200 మందికి పైగా కూలీలు పనులకు రావాలన్నారు. మండలంలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది సుధాకర్‌రెడ్డి, గ్రామ పెద్ద పెందోర్ రాజేశ్వర్ ఉన్నారు.

### రాంజీగోండు అడుగుజాడల్లో నడవాలి



రాంజీగోండు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

**ఆసిఫాబాద్‌అర్బన్:** హక్కుల సాధన కోసం రాంజీగోండు పోరాట స్ఫూర్తిని నేటితరం యువత ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో మంగళవారం రాంజీగోండు 167వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుధాకర్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చేందుకు రాంజీగోండు చేసిన పోరాటం మరువలేనిదన్నారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి అమరుడయ్యారని గుర్తు చేశారు. రాంజీగోండు చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మర్సుకోల తిరుపతి, పర్చకి కేశవరావు, కుర్సెంగ మోతీరాం, మడావి నర్సింగరావు పాల్గొన్నారు.

### ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉగాది



మాట్లాడుతున్న ప్రతినిధి శ్రీనివాస్

**ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్ శివాలయంలో మంగళవారం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు కేశవరావ్ బలిరాంపంత్ హెడ్గేవార్ జయంతి సందర్భంగా ఆధ్యసర్ సంఘచాలక్ ప్రణామ్ సమర్పించారు. అనంతరం ఉత్సవ కార్యక్రమం ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్ మాట్లాడుతూ భారతీయులను సంఘటితం చేయడంలో ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్యపాత్ర వహిస్తుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి కందికంటి శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణ, కుటుంబ ప్రబోధన్, గో సంరక్షణతో పాటు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖండ కార్యవాహ శ్రీనివాస్, మధునయ్య, కల్లూరి సంతోష్, అశోక్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: మోతుగూడలో సాగు పనులు ప్రారంభిస్తున్న కుటుంబం



ఉగాది పచ్చడి సేవిస్తున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి



జిల్లా కేంద్రంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ



# క్రోధికి స్వాగతం

- ఘనంగా ఉగాది వేడుకలు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణం
- అరక పట్టి.. సాగు ప్రారంభించిన అన్నదాతలు
- ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు



పెంచికల్‌పేట్: ఎల్కపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



శివకేశవ మందిరంలో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు మధుకర శర్మ



కెరమెరి: విత్తనాలు విత్తుతున్న రైతులు

**ఆసిఫాబాద్:** శ్రీ క్రోధి నామ సంవత్సరానికి మంగళవారం జిల్లా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి.. షడ్రుచుల పచ్చడితో ఉగాదిని సంబురంగా జరుపుకొన్నారు. జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయం, శివకేశవ మందిర్, షిర్డీ సాయి మందిరంలో అర్చకులు ఇందారపు మధుకర శర్మ పంచాంగ శ్రవణం చేశారు. పల్లెల్లో రైతులు వ్యవసాయ పనిముట్లు, ఎద్దులకు పూజలు చేసి వ్యవసాయ పనులు ప్రారంభించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఎమ్మెల్యే కోవ లక్ష్మిని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉగాది పచ్చడి సేవించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు ఆత్రం సక్కు కేస్లాపూర్ హన్మాన్ ఆలయాన్ని సందర్శించారు. సరస్వతి శిశుమందిర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం చేసి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అంబేద్కర్ చౌరస్తాలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, ఉపాధ్యక్షుడు పురుషోత్తం బాలేశ్, యువజన సంఘం అధ్యక్షుడు అవిడపు ప్రణయ్, రైతు సంఘం అధ్యక్షుడు వైరాగడే మారుతి పటేల్, ప్రశాంత్, సాయికృష్ణ పాల్గొన్నారు.

# ‘దత్తత’ వైద్యం!

- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం
- ఐదు కుటుంబాల చొప్పున దత్తత తీసుకున్న విద్యార్థులు
- ఆరోగ్య పరిస్థితి పరిశీలించి.. హెల్త్ ప్రొఫైల్ రూపకల్పన
- రోగ నిర్ధారణ పరీక్షలు చేసి మందులు సూచించాల్సిన బాధ్యత వారిదే..




రెబ్బెన మండలం గంగాపూర్‌లో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు (ఫైల్)

**ఆసిఫాబాద్‌అర్బన్:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో చదువుతున్న ప్రతీ విద్యార్థి ఐదు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ఏడాది మొత్తం వారి ఆరోగ్య పరిస్థితులను పూర్తిస్థాయిలో పరీక్షించనున్నారు. కుటుంబ సభ్యులందరికీ రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అందుకు తగిన మందులు సైతం సూచించనున్నారు. జాతీయ మెడికల్ కమిషన్ ఆదేశాలతో ‘ఫ్యామిలీ అడప్షన్ ప్రోగ్రాం’ అనే కార్యక్రమానికి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల యాజమాన్యం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రస్తుతం వంద మంది విద్యార్థులు చదువుతున్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ నాగార్జునాచారి, మెడికల్ అధికారి సుజీత్ ఆధ్వర్యంలో విద్యార్థులు రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలోని కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ఈ నెల 6న గ్రామంలో పర్యటించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వారి ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు.

**తొమ్మిది విడతలుగా సందర్శన**

మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులు రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామాన్ని దత్తత తీసుకుని స్థానికుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తున్నారు. కుటుంబంలోని ప్రతీ వ్యక్తి ఆరోగ్య వివరాలను నమోదు చేసుకుంటున్నారు. వ్యక్తి పేరు, వయస్సు, ఇల్లు, పరిసర ప్రాంతాల పరిస్థితి, వారి ఆరోగ్య పరిస్థితి, రోగ నిర్ధారణ పరీక్షల ఫలితాలు, అవసరమైన చికిత్స, ఇతర పూర్తి వివరాలతో ప్రొఫైల్ రూపొందిస్తున్నారు. మెడికల్ విద్యార్థికి ఏడాది పాటు ఫ్యామిలీ డాక్టర్ తరహాలో వారికి అందుబాటులో ఉండనున్నారు. సంవత్సర కాలంలో కనీసం తొమ్మిది విడతలుగా గ్రామాన్ని సందర్శించాల్సి ఉంటుంది. గ్రామస్తుల ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటూ.. వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలి.

### ఫ్యామిలీ డాక్టర్‌లా సేవలు

వైద్య విద్యార్థులు గ్రామాలకు వెళ్లి కుటుంబాలను దత్తత తీసుకుని, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఫ్యామిలీ డాక్టర్‌లా వ్యవహరించాలని జాతీయ మెడికల్ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో పని చేస్తేనే ఆరోగ్య పరిస్థితులపై అవగాహన రావడంతో కోర్సు పూర్తయ్యే లోగా తగిన అనుభవం వస్తుందని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కుటుంబాల దత్తత అంశాన్ని ఇప్పటికే ఎంబీబీఎస్ పాఠ్యప్రణాళికలో చేర్చారు. తాజాగా దీనికి సంబంధించి పూర్తిస్థాయి మార్గదర్శకాలు కూడా విడుదలయ్యారు. దీని ప్రకారం ఎంబీబీఎస్ ఫస్టియర్‌లోనే కుటుంబాల దత్తత ప్రణాళిక ప్రారంభమవుతుంది. ఒక్కో విద్యార్థికి కనీసం ఐదు కుటుంబాలను కేటాయిస్తారు.

### విధివిధానాలు..

- కుటుంబంలో ఎవరికైనా రక్తహీనత, పిల్లల్లో పోషకాహార లోపం, బీపీ, మధుమేహం, కిడ్నీ సంబంధిత వ్యాధులు ఉంటే గుర్తించాలి.
- ఇతర సాధారణ వ్యాధులు సోకితే వారికి తగిన వైద్యం అందించాలి.
- రోగ నిరోధక శక్తి పెంచుకునేందుకు వ్యాయమం, యోగా చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు.
- పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యం గురించి వారికి వివరించి, శుభ్రత పాటించేలా ప్రోత్సహించాలి.
- గడువు పూర్తయ్యేలోగా తమకు కేటాయించిన ఐదు కుటుంబాలకు సంబంధించి పూర్తి హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలి.
- గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి. అవసరమైతే ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తల సహకారం తీసుకోవాలి.

### వివరాలు తెలుసుకుంటాం



ఇప్పటికే రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామాన్ని ఈ నెల 6న సందర్శించాం. చాలా కుటుంబాల్లో ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య వివరాలు తెలుసుకుంటాం. మాకు మరింత అవగాహన రావాల్సి ఉంది.

– గోతి అరుణ్, వైద్య విద్యార్థి

### బాధ్యత పెరిగింది



గ్రామంలో బోదకాలు, కిడ్నీ, జాండీస్, కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించాం. కుటుంబాలను దత్తత తీసుకోవడంతో మాపై బాధ్యత పెరిగింది. కోర్సు పూర్తయిన తర్వాత పేదలకు వైద్యం అందించి వారి ఆరోగ్య రక్షణకు కృషి చేస్తా.

– అజిత్, వైద్య విద్యార్థి

### స్వచ్ఛమైన నీటిని అందించాలి



గ్రామీణులకు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడంతోపాటు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి. అప్పుడే చాలావరకు వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. దత్తత తీసుకున్న కుటుంబాలను నెలకు రెండుసార్లు కలిసే అవకాశం కల్పించాలి.

– కుమార్, వైద్య విద్యార్థి

# అర్ధరాత్రి.. అక్రమ రవాణా

మార్చి 24న అర్ధరాత్రి మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు ఓ లారీలో 19 పశువులను తరలిస్తుండగా సిర్పూర్(టి)లోని దౌనల్ వద్ద పలువురు అడ్డుకున్నారు. అక్కడ ఇరువర్గాల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగి తోపులాటకు దారితీసింది. సీఐ సాదిక్‌పాషా, ఎస్సై రమేశ్ ఘటనా స్థలికి చేరుకుని లారీని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించాలని ఆదేశించారు. కానీ డ్రైవర్ లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించకుండా వేగంగా ప్రధాన రహదారి గుండా కాగజ్‌నగర్ వైపు తీసుకెళ్లాడు. కొందరు బైక్‌లపై వెంబడించి రైల్వే గేట్ వద్ద అడ్డుకుని పశువులను విడిపించారు. పోలీసులు లారీని స్టేషన్‌కు తరలించి నలుగురిపై కేసు నమోదు చేశారు.

మార్చి 27న అర్ధరాత్రి మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు పశువులతో వెళ్తున్న వ్యాన్ వాంకిడి మండల కేంద్రంలోని పాత జిన్నింగ్ మిల్లు సమీపంలో జాతీయ రహదారిపై ఓ వ్యక్తిని ఢీకొట్టింది. అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అయినా ఆపకుండా వెళ్లిపోవడంతో పోలీసులు వ్యాన్‌ను సరిహద్దులోని టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నారు. డ్రైవర్ పారిపోగా వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాహనంలోని 19 పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించారు. డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.



వాహనంలో కుక్కిన పశువులు(ఫైల్)

- రాత్రిపూట పశువుల అక్రమ రవాణా
- అడ్డుకుంటున్నా.. ఆగని దందా
- ఇటీవల సిర్పూర్(టి), వాంకిడి మండలాల్లో ఘటనలు
- గ్రామాల్లో అర్ధరాత్రి మూగజీవాల అపహరణ

**కౌటాల(సిర్పూర్):** అక్రమార్కులు మూగజీవాల ఉసురు తీస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి పశువులను వాహనాల్లో కుక్కి అర్ధరాత్రి దాటిన తర్వాత గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. గత నెలలో జిల్లాలో రెండుచోట్ల స్థానికులు పశువులు తరలిస్తున్న వాహనాలు పట్టుబడటంతో పశువుల రవాణా అంశం మళ్లీ తెర పైకి వచ్చింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సంతలతోపాటు మహారాష్ట్రలోని సరిహద్దు గ్రామాల్లో అనుమతి లేకుండానే రైతుల నుంచి ఆవులు, ఎద్దులను కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేట్ వాహనాల్లో కుక్కి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వాహనాలపై టార్పాలిన్లు కప్పి కరీంనగర్, హైదరాబాద్ వంటి నగరాలకు పయనమవుతున్నారు. కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి రావడంతో మూగజీవాలు ఊపిరాడక ప్రాణాలు వదులుతున్నాయి.

**నిబంధనల ఉల్లంఘన**

గో సంరక్షణ చట్టం- 1977 ప్రకారం పాలిచ్చే గోవులు, ఎద్దులు, దూడలు కబేళాలకు తరలించడంపై నిషేధం ఉంది. ఏ గోవునైనా కబేళాలకు తరలించాలంటే కచ్చితంగా సంబంధిత అధికారుల నుంచి అనుమతి పత్రం పొందాలి. అయితే జిల్లాలో కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి పశువుల అక్రమ రవాణా దందా సాగిస్తున్నారు. ముఖ్యంగా వాంకిడి, సిర్పూర్(టి), చింతలమానెపల్లి, కౌటాల, జైనూర్ మండలాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది. జిల్లాలోని పలు ప్రాంతాలను కలిపే సరిహద్దును వీరు వినియోగించుకుంటున్నారు. అలాగే గ్రామాల నుంచి పశువులను దొంగలించి అమ్ముకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సిర్పూర్(టి) మండల కేంద్రంలోని షేక్ అహ్మద్‌గూడ కాలనీకి చెందిన ముగ్గురు రైతుల ఐదు వ్యవసాయ ఎద్దులు ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు.

**చర్యలు శూన్యం..**

మూగజీవాలను తరలించడానికి ప్రత్యేక చట్టాలున్నా అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల నుంచి దళారులు పశువులను ఇష్టారీతిన తరలిస్తున్నారు. ముందుగా జిల్లాలోని పలు రహదారుల నుంచి మంచిర్యాల వరకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి నేరుగా కరీంనగర్, హైదరాబాద్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఓ వైపు ఎన్నికల చెక్‌పోస్టులు ఉన్నా ఈ దందా కొనసాగడంపై విమర్శలు వస్తున్నాయి. అక్కడక్కడ పోలీసులు వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేసి, పశువులను గోశాలలకు తరలిస్తున్నారు. అయితే శాశ్వత చర్యలు చేపట్టకపోవడంతో రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు.

# బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

**పెంచికల్‌పేట్(సిర్పూర్):** ఏనుగు దాడిలో ప్రాణాలు కోల్పోయిన రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ డిమాండ్ చేశారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఏనుగు దాడిలో ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోయినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని మండిపడ్డారు. జిల్లా మంత్రితోపాటు సంబంధిత శాఖ మంత్రులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి భరోసా ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరారు. ఆయన వెంట నాయకులు ఎల్కరి సుధాకర్, నగునూరి శ్రీనివాస్, బిట్టి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్




రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

**బెజ్జూర్(సిర్పూర్):** స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసులు మర్యాదపూర్వకంగా మెలగాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. బెజ్జూర్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసులకు సంబంధించిన ఫైల్స్, రికార్డులు పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని సూచించారు. ప్రతీ గ్రామంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రజా ఫిర్యాదులను పరిష్కరించడంలో ఎలాంటి జాప్యం చేయకుండా వేగంగా స్పందించాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలన్నారు. చెక్‌పోస్టుల్లో వాహన తనిఖీలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్థానిక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

**చింతలమానెపల్లి(సిర్పూర్):** పార్లమెంట్ ఎన్నికల నియమావళిని అమలు చేయాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో రాజకీయ పార్టీలు, వ్యక్తులకు అతీతంగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆదేశించారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, సీఐ సాదిక్ పాషా, ఎస్సైలు నరేశ్, విక్రమ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## క్లుప్తంగా

### కాసిపేట-2గనిపై తేనెటీగల దాడి

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట-2గనిపై మంగళవారం ఉదయం తేనెటీగలు దాడిచేయగా కార్మికులకు గాయాలయ్యాయి. ఉగాది పండుగను పురస్కరించుకుని ఉదయం గని ఆవరణలోని ఆలయం వద్దకు ఉద్యోగులంతా పూజలు నిర్వహించేందుకు వెళ్లారు. ఈ సమయంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. సుమారు 30మంది కార్మికులను తేనెటీగలు కుట్టడంతో అక్కడి నుంచి తప్పించుకుని గదుల్లోకి వెళ్లారు. అందరికీ స్వల్పగాయాలయ్యాయి. వీరిలో చంద్రశేఖర్ అనే కోల్‌కట్టర్, రాజశేఖర్ అనే జనరల్ మజ్దూర్‌కు తేనెటీగలు ఎక్కువగా కుట్టడంతో వారిని మందమర్రి డిస్పెన్సరీకి తరలించారు. అక్కడి నుంచి చంద్రశేఖర్‌ను రామకృష్ణపూర్ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

### చికిత్స పొందుతూ గర్భిణి మృతి


లక్ష్మి మృతదేహం

జైనూర్: మండలంలోని దుబ్బగూడ పంచాయతీ పరిధి లక్ష్మణ్ పటేల్‌గూడకు చెందిన నిండు గర్భిణి ఆత్రం లక్ష్మి (30) దమ్ము, దగ్గుతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నిండు గర్భిణి లక్ష్మికి మంగళవారం దమ్ము, దగ్గు అధికం కావడంతో కుటుంబీకులు జైనూర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి 108లో ఉట్నూర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో ఆ కుటుంబంలో పండుగపూట విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాన్ని సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు మడావి భీంరావ్, పటేల్ లక్ష్మణ్ తదితరులు పరామర్శించారు.

### పెద్దవాగులో గల్లంతై ఒకరి మృతి


హన్మంతు (ఫైల్)

కాగజ్‌నగర్‌రూరల్: దుబ్బ గూడ గ్రామానికి చెందిన ఊరడి హన్మంతు (52) ప్రమాదవశాత్తు పెద్దవాగులో పడి మృతి చెందాడు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 7న చింతపండు అమ్మేందుకు హన్మంతు ఆసిఫాబాద్ మండలం రహపల్లికి వెళ్లేందుకు పెద్దవాగు దాటుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతయ్యాడు. ఈ మేరకు పెద్దవాగులో గాలించగా, మంగళవారం మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య విమల ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### ముందుజాగ్రత్తలతో లాభాలు

చెన్నూర్‌రూరల్: మామిడి రైతులు ముందు జాగ్రత్తలు పాటిస్తే లాభాలు గడించవచ్చని హెచ్‌వో తిరుపతి ఓ ప్రకటనలో తెలిపారు. కోత సమయంలో కాయలు పక్వానికి వచ్చాయో.. లేదో.. తెలుసుకోవాలని, ఉదయం, సాయంత్రం వేళల్లో కోయాలని పేర్కొన్నారు. సైజుల వారీగా గ్రేడింగ్ చేసి ప్యాక్ చేయాలని, మార్కెట్‌లో ధర ఉన్నప్పుడే విక్రయించాలని సూచించారు.



# సందడే.. సందడి

- కిటకిటలాడుతున్న క్రీడా మైదానాలు
- సెలవులకు ముందే శిక్షణ షురూ..
- తర్ఫీదు ఇస్తున్న పలువురు కోచ్‌లు
- ఉత్సాహం చూపుతున్న విద్యార్థులు


మంచిర్యాల బాలుర పాఠశాల మైదానంలో క్రికెట్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు


బాక్సింగ్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): విద్యాసంస్థలకు ఇంకా సెలవులు ప్రారంభం కానేలేదు. అప్పుడే క్రీడా మైదానాలు సందడిగా మారాయి. సెలవుల్లో ప్రారంభమయ్యే క్రీడా శిక్షణ కార్యక్రమాలు అప్పుడే ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాలు వివిధ క్రీడాంశాల్లో కోచ్‌లు శిక్షణ ప్రారంభించగా అధికసంఖ్యలో క్రీడాకారులు హాజరవుతున్నారు. ఫిట్‌నెస్ పరీక్షలు మొదలు వివిధ క్రీడాంశాల్లో ప్రత్యేక శిక్షణపై కోచ్‌లు దృష్టి సారించారు. ప్రస్తుతం విద్యాసంస్థలు ఒక్కపూటే కొనసాగుతుండగా ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారిని మైదానాలకు తీసుకువస్తుండగా, ఫిట్‌నెస్ క్లబ్, వాకర్స్ అసోసియేషన్ శిక్షణ ఇస్తున్నారు. దీంతో మైదానాలు క్రీడాకారులతో సందడిగా మారాయి.

#### గ్రూపుల వారీగా శిక్షణ

అథ్లెటిక్స్‌తో పాటు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ పొందేందుకు వస్తున్న క్రీడాకారులను జూనియర్లు, సీనియర్లుగా విభజించి శిక్షణ ఇస్తున్నారు. వేసవి క్రీడా శిబిరాలు ప్రారంభం కాకముందే కొందరు కోచ్‌లు ప్రైవేట్‌గా శిక్షణ ఇస్తూ ఫీజు తీసుకుంటున్నారు. ఇప్పటికే శిక్షణ పొందుతున్న వారిలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించిన వారు ఉండగా.. వారు మరింత ఉన్నతంగా రాణించేందుకు కఠోర శిక్షణ ఇస్తున్నారు. క్రీడాకారులుగా వారి ఉజ్వల భవితకు బాటలు వేసేలా కృషి చేస్తున్నారు. నైపుణ్యం కనబరుస్తున్న వారికి దీర్ఘకాలికంగా శిక్షణతోపాటు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వేసవి సెలవులు ప్రారంభమైతే యువజన క్రీడల శాఖ, క్రీడా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే క్రీడా శిబిరాలకు హాజరయ్యే విద్యార్థులతో మైదానాలు మరింత సందడిగా మారనున్నాయి.

#### ఉన్నతంగా రాణించేలా..



అన్ని వయస్సుల వారికి క్రికెట్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటికే జిల్లా క్రికెట్ అసోసియేషన్ ద్వారా పలువురు క్రీడాకారులు యూనివర్సిటీ, జిల్లా, అంతర్‌జిల్లా స్థాయిలో ఆడారు. ఇద్దరు అండర్–23 ప్రాబబుల్ జట్టులో చోటు సాధించారు. వేసవి సెలవులు ప్రారంభం కాగానే ఉదయం, సాయంత్రం శిక్షణ ఇస్తాం.

– ప్రదీప్, కోచ్, జిల్లా క్రికెట్ అసోసియేషన్

#### శిక్షణ బాగా ఇస్తున్నారు



బాక్సింగ్‌లో మూడేళ్లుగా శిక్షణ తీసుకుంటున్నాను. జోనల్, జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనడంతో పాటు రాష్ట్ర స్థాయిలో పతకం సాధించాను. టైసన్ బాక్సింగ్ అకాడమీ ద్వారా కోచ్ బాక్సింగ్‌లో మెరుగైన శిక్షణ ఇస్తున్నారు. భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ పొందుతున్నాను.

– క్రితీ అగర్వాల్, మంచిర్యాల

#### రోజూ శిక్షణకు వస్తున్నా..



ప్రతీరోజు బాక్సింగ్ శిక్షణ తీసుకుంటున్నాను. నిరంతర సాధనతోనే పతకాలు సాధించవచ్చు. జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధించాను. కోచ్ ప్రోత్సాహంతో ప్రతీరోజు మైదానానికి వస్తున్నాను. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని కఠిన శిక్షణ పొందుతున్నాను.

– పీ నితిన్, మంచిర్యాల

#### ఉచిత శిక్షణ ఇస్తున్నాం



జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ఔత్సాహికులకు శిక్షణ ఇస్తూ మెరికల్లా తయారు చేస్తున్నాం. ఎక్కడ పోటీలున్నా పాల్గొని ప్రతిభ చాటేలా ప్రోత్సహిస్తున్నాం. మరింత ప్రతిభావంతులుగా తయారు చేసేందుకు ఖేలో ఇండియా కేంద్రం ద్వారా బాక్సింగ్‌లో ఉచితశిక్షణ ఇస్తున్నాం.

– రాజేశ్, కోచ్, టైసన్ బాక్సింగ్ అకాడమీ

## కేకే–ఓసీలో కార్మికుడికి అస్వస్థత

- అధికారి వేధింపులే కారణమని బాధితుడి ఆరోపణ


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీలో విజయకుమార్ అనే జనరల్ మజ్దూర్ కార్మికుడు విధి నిర్వహణలో అస్వస్థతకు గురయ్యాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. విజయ్‌కుమార్ మంగళవారం రెండో షిఫ్టులో విధులకు హాజరయ్యాడు. పని పంపిణీ చేసే అధికారి విజయ్‌కుమార్‌ను పంపు ఆపరేటర్ డ్యూటీ చేయాలని చెప్పాడు. అక్కడ తాను పని చేయలేనని, వేరే పని చెప్పాలని కోరినా తప్పదన్నట్లు ఆదేశించాడు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో విజయ్‌కుమార్ పంపు ఆపరేటర్ డ్యూటీకి వెళ్లాడు. అక్కడికి వెళ్లిన కొద్దిసేపటికే అస్వస్థతకు గురయ్యాడు. అధికారులకు సమాచారం ఇవ్వగా పని స్థలం నుంచి బయటకు తీసుకువచ్చి అతడికి మందమర్రిలోని కేకే డిస్పెన్సరీలో ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి పంపారు. కాగా, అధికారుల పని ఒత్తిడితోనే తాను అస్వస్థతకు గురయ్యానని విజయ్‌కుమార్ ఆరోపించాడు. జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహించే తనను పంపు ఆపరేటర్‌గా పంపవద్దని అధికారిని ఎంత బతిమాలినా వినలేదని వాపోయాడు.

### కాసిపేట 2గనిపై కార్మికుల నిరసన

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–2గనిపై మంగళవారం మధ్యాహ్నం రెండో షిఫ్టులో కార్మికులు అధికారుల తీరును నిరసిస్తూ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. సెలవుల విషయంలో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ అక్కడికి చేరుకున్నారు. గని మేనేజర్ లక్ష్మీనారాయణ, అధికారులతో చర్చించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకుంటామని కార్మికులకు హామీ ఇప్పించడంతో వారు ఆందోళన విరమించారు. ఆందోళనతో కార్మికులు పనిస్థలాలకు సుమారు గంట ఆలస్యంగా వెళ్లారు.

### మే 6నుంచి డిగ్రీ 2,4,6 సెమిస్టర్ పరీక్షలు

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ బీబీఏ బీఏ (ఎల్ఎం)కు సంబంధించిన రెండో, ఆరో సెమిస్టర్ పరీక్షలు మే 6నుంచి, నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 7వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 23, 25 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 7, 9, 15, 17, 20, 22, 24, 27 తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆరో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 23, 25, 28, 30, 31, జూన్ 1, 3వ తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## పార్టీ పేరుతో అక్రమ వసూళ్లు


మాట్లాడుతున్న సంకె రవి

పాతమంచిర్యాల: సీపీఐ(ఎం) పేరు చెప్పుకొని పార్టీతో సంబంధం లేని కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని జిల్లా కార్యదర్శి సంకె రవి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాలకు చెందిన గుమాస గోవర్ధన్, మాల గురిజాలకు చెందిన గుమాస బ్రహ్మానందం ముఠాగా పార్టీ రాష్ట్ర కమిటీ పేరిట రశీదులు ముద్రించి ప్రజలు, ప్రముఖుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఎవరైనా పార్టీ పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. వసూళ్లకు పాల్పడినవారిపై మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీ ప్రకాశ్, దాసరి రాజేశ్వరి, సభ్యులు జీ అశోక్, దుంపల రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

### హామీల అమలుకు కృషి


ఐకే1ఏ గనిపై మాట్లాడుతున్న సీతారామయ్య

జైపూర్: గుర్తింపు సంఘం ఎన్నికల ముందు ఉద్యోగులకిచ్చిన హామీల అమలుకు కృషి చేస్తున్నామని, అంతర్గత ఖాళీలను పారదర్శకంగా భర్తీ చేయిస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. ఇందారం ఐకే–1ఏ గనిపై మంగళవారం ఐకే–1ఏ గని పిట్ సెక్రటరీ చింతల నవీన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌కు హాజరై మాట్లాడారు. సీఎం పీఎఫ్ లోన్లు అందరికీ చేరేలా చూస్తామని తెలిపారు. సంస్థలో అవినీతిని అరికట్టడానికి గుర్తింపు సంఘం చేపట్టే పోరాటాల్లో ఉద్యోగులంతా కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, నాగభూషణం, నాయకులు శ్రీకాంత్, దేవేందర్, రాజయ్య, తిరుపతి, రమేశ్, మహేందర్, సురేశ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

### వాంతులతో చిన్నారి మృతి


శృతిలయ మృతదేహం

ఇంద్రవెల్లి: వాంతులు చేసుకున్న చిన్నారి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందడంతో మండలంలోని హర్కపూర్ అంద్‌గూడ పంచాయతీ పరిధిలోని కైలాస్‌నగర్‌లో విషాదం నెలకొంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... డాకురే రాము–మంజుల దంపతులకు శృతిలయ(6), మూడేళ్ల పృధ్వీరాజ్ ఉన్నారు. నెల క్రితం శృతిలయ అనారోగ్యానికి గురికాగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గుండెలో నరం బ్లాక్ అయిందని, ఆపరేషన్ చేయాలని తెలిపారు. వైద్యులు సూచన మేరకు వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ఆపరేషన్ చేయించారు. దీంతో నెల రోజులుగా చిన్నారి ఆరోగ్యంగానే ఉంది. మంగళవారం తెల్లవారు జామున వాంతులు చేసుకోవడంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి చిన్నారి మృతి చెందింది. ఉన్న ఏకైక కూతురు మృతి చెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

## దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసు


గొడవపడుతున్న ఇరువర్గాలవారు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్డు అండర్ బ్రిడ్జి మూలమలుపు వద్ద జరిగిన దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక మసీదువాడకు చెందిన సింగరేణి ఉద్యోగి దేవి అంజుశరత్ మంగళవారం తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అశోక్‌రోడ్ మూలమలుపు వద్ద సయ్యద్ జావిద్ అడ్డంగా నిలబడ్డాడు. ఎందుకు ద్విచక్ర వాహనానికి అడ్డంగా నిలబడ్డావని శరత్ సయ్యద్‌జావీద్‌ను ప్రశ్నించగా బండరాయితో దాడి చేశాడు. మరికొంతమంది అక్కడికి చేరుకుని శరత్‌పై దాడికి పాల్పడగా తీవ్రగాయాలయ్యాడు. అటుగా వెళ్తున్న శరత్ అమ్మతోపాటు మరికొంత మంది ఇరువురిని సముదాయించగా గొడవ సద్దుమణిగింది. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### కబ్జా కోరల్లో వంకయ్య కుంట?



దండేపల్లి మండలం నర్సాపూర్–కొండాపూర్ గ్రామాల మధ్యనున్న వంకయ్య (అంకయ్య) కుంట కబ్జాకు గురవుతోంది. 207 సర్వే నంబర్‌లో సుమారు 5.21 ఎకరాల విస్తీర్ణంతో ఉన్న కుంట శిఖాన్ని కొందరు సమీప రైతులు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో వ్యవసాయ బావులు కూడా తవ్వారు. ఓ తూము ఆనవాళ్లు కూడా కనిపించడంలేదు. క్రమక్రమంగా శిఖం భూమిని ఆక్రమిస్తూ కుంట ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కబ్జా రాయుళ్లపై చర్యలు తీసుకుని, కుంట శిఖం భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. – దండేపల్లి

## ఘనంగా భూసుపోషణ్


నర్సింగాపూర్‌లో పూజా కార్యక్రమంలో రైతులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో మంగళవారం గ్రామ భారతి, హాజీపూర్ రైతు ఉత్పత్తి కేంద్రం ఆధ్వర్యంలో భూ సుపోషణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి ముందుగా గోమాతకు ప్రత్యేక పూజ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన మట్టిని మొక్కలు, చెట్ల చుట్టూ పోశారు. మొక్కల సంరక్షణతో పాటు సేంద్రియ వ్యవసాయం చేస్తామని సామూహిక ప్రతిజ్ఞ చేశారు. సేంద్రియ వ్యవసాయంతో భూమికి రక్షణ ఇవ్వడంతో పాటు రసాయన రహిత సేద్యం సాధ్యమవుతుందని, భూమాతనూ కాపాడుకున్న వారమవుతామని ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ గ్రామవికాస్ ప్రముఖ్ జంగంపల్లి రాజేశ్ పేర్కొన్నారు. గ్రామభారతి గుడి, బడి, మడి, అమ్మ ఒడి సరుకులు, అంగడి అనే ఐదు విషయాలపై పని చేస్తుందని తెలిపారు. గుడి అంటే ధార్మిక క్షేత్రాల మీద, బడి అంటే విద్యాలయాల మీద, మడి అంటే వ్యవసాయం మీద, సరుకులు, అంగడి మార్కెట్ మీద, అమ్మ ఒడి అంటే పిల్లల ఆరోగ్యం మీద పని చేస్తుందని వివరించారు. రైతులు సేంద్రియ సాగువైపు దృష్టి సారించేలా చైతన్యం నింపేందుకు భవిష్యత్‌లో పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామభారతి జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి, ఎఫ్‌పీఎస్ డైరెక్టర్లు పూస్కూరి శ్రీనివాసరావు, బొడ్డు శంకర్, నర్సింగాపూర్ గ్రామభారతి అధ్యక్షుడు లగిశెట్టి వెంకటి, సభ్యులు కస్తూరి మల్లేశ్, చెలిమెల నారాయణ, నల్ల శంకరయ్య, భోగ నందయ్య, నడిమెట్ల రాజశేఖర్, మండలంలోని సేంద్రియ సాగు రైతులు, ఇతర రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## రేషన్‌బియ్యం పట్టివేత


తాండూర్: పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం


రెబ్బెన: స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

రెబ్బెన: మండలంలోని దేవులగూడ నుంచి అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన రేషన్ బియ్యాన్ని మంగళవారం తెల్లవారుజామున ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ముందస్తుగా అందిన పక్కా సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ దేవులగూడలో తనిఖీ చేయగా ఇతర ప్రాంతాలకు తరలించేందుకు రేషన్‌బియ్యాన్ని వ్యాన్‌లో లోడ్ చేస్తున్నారు. వ్యాన్‌లోని బియ్యంతో పాటు ఇంట్లో నిల్వ ఉంచిన సుమారు 40 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యంతో పాటు బియ్యాన్ని తరలించేందుకు ఉపయోగించిన వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు డీటీ తెలిపారు. పంచనామా అనంతరం పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు తెలిపారు.

తాండూర్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై జగదీశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కన్నెపల్లి మండలం జనకాపూర్ గ్రామానికి చెందిన గుల్బం రాకేశ్ మంగళవారం బొలెరో గూడ్స్ వాహనంలో 12.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తాండూర్‌కు అక్రమంగా తరలిస్తున్నాడు. ఇదే సమయంలో రేచిని గ్రామ శివారులో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బియ్యంతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాకేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## తండ్రిపై కత్తితో దాడి చేసిన కొడుకు


చికిత్స పొందుతున్న రవీందర్

నస్పూర్: కొడుకు, కోడలు గొడవ పడుతుంటే వారించడానికి వెళ్లిన తండ్రిపై కొడుకు కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని సీసీసీ చేపల మార్కెట్ వద్ద బూర్ల రవీందర్ నివాసముంటున్నాడు. ఇతడి కుమారుడు రాజు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాజు భార్య ఇంటి ఎదుట కూరగాయలు, కొబ్బరి బోండాల దుకాణం నిర్వహిస్తోంది. కాగా, దుకాణం వద్ద మంగళవారం సాయంత్రం రాజుకు అతడి భార్య మధ్య గొడవ జరిగింది. దీంతో 'ఎందుకు గొడవ పడుతున్నారు' అని రాజు తండ్రి రవీందర్ వారిని వారించే ప్రయత్నం చేశాడు. ఈక్రమంలో మా మధ్యలోకి ఎందుకు వస్తున్నావంటూ రాజు కొబ్బరి బోండాలు కొట్టే కత్తితో తండ్రిపై దాడి చేశాడు. దీంతో గాయపడ్డ రవీందర్‌ను స్థానికులు 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి బంధువు సాంబారు మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అలరించిన అంతర్రాష్ట్ర కుస్తీపోటీలు

కుభీర్: మండల కేంద్రమైన కుభీర్‌లో విఠలేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పండగను పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహించారు. ఇందులో నియోజకవర్గంలో పలు గ్రామాల భక్తులతో పాటు మహారాష్ట్రలోని పలు గ్రామాల మల్లయోధులు పాల్గొని కుస్తీలో తలపడ్డారు. మొదటి బహుమతి రూ.6వేలు నవీన్ (హర్యానా) గెలిచారు. రెండో బహుమతి రూ.4వేలను ప్రశాంత్ (పర్భణీ) కైవసం చేసుకున్నాడు. ఆలయ కమిటీ చైర్మన్ బీ పెంటాజీ, మాజీ మండలాధ్యక్షుడు బీ విఠల్, బీజేపీ నాయకులు శేఖర్, ఉప్పు దత్తాత్రి, సాయినాథ్, వీ నాగేశ్, కనకయ్య, ఆలయ కమిటీ సభ్యులు నాగలింగం, శంకర్, రాజన్న ఉన్నారు.


కుస్తీలో తలపడుతున్న మల్లయోధులు